



# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 12 ఆగస్టు 2025 పేజీలు 8





# నేషన్ ఫస్ట్

## అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలి




- మువ్వన్నెల జెండా ఓ ఉద్వేగం - ఓ స్ఫూర్తి
- జాతీయ పతాకాన్ని రూపొందించింది తెలుగువారు కావడం గర్వకారణం
- మోదీ రూపంలో దేశానికి సమర్థ నాయకత్వం
- ప్రతి ఇల్లు, ప్రతి కార్యాలయంపై జాతీయ జెండా రెపరెపలాడాలి
- హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2




# కార్మికుల భద్రత, సంక్షేమమే ధ్యేయం

- పరిశ్రమల్లో భద్రతకు పెద్దపీట
- కార్మికుల ఆరోగ్య భద్రతపై దృష్టి పెట్టాం
- ఈఎస్ఐ వైద్యశాలల్లో 500 ఖాళీల భర్తీకి అనుమతి
- ఈఎస్ఐ వైద్యశాలల్లో వైద్య పరికరాల కొనుగోలుకు అనుమతులు
- ఫ్యాక్టరీల్లో జీరో ప్రమాదాల పై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.
- రాష్ట్రంలో త్వరలో 7 వైద్యశాలలు, 96 డిస్పెన్సరీలు ఏర్పాటు చేయనున్నాము.
- ఈఎస్ఐ వైద్యశాలకు ఎస్‌బిఐ సహకారంతో రెండు అంబులెన్స్‌లు
- రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్ అండ్ వైద్య భీమా సేవల శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్

వివరాలు 2లో

## దేశంలో గ్రామీణ క్రీడలకు అండగా ఎంపీ కేశినేని చిన్ని

లోక్ సభలో జాతీయ క్రీడా పాలన బిల్లు - 2025 పై ప్రసంగించిన ఎంపీ

2

## హర్ దిల్ తిరంగా.. హర్ ఘర్ తిరంగా..

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2లో..

## చేనేతలకు చేయూతే లక్ష్యం

చిన్నాపురంలో చేనేతల అభినందన సభలో మంత్రి కొల్లు రవీంద్ర

7

# నేషన్ ఫస్ట్ అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలి




**విజయవాడ, ఆగస్టు 11 మేజర్ న్యూస్ :** కుల, మత, ప్రాంత, భాషా భేదం లేకుండా దేశమంత ఒకటే అనే జాతీయ భావన పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తిరం గా అంటే కేవలం ఇంటిపై జెండా ఎగరేయడం కాదని, దేశభక్తిని పెంచే సంకల్పమన్నారు. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ముందుగా జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పింగళి వెంకయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...గతంలో ఈ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అనేక కార్యక్రమాలకు నేను హాజరయ్యానని, కానీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందాన్నిస్తోందని అన్నారు. ఏ జెండా చూస్తే ప్రతి భారతీయ పౌరుడి మనసు పులకరిస్తుందో, ఏ జెండా చూస్తే దేశం యావత్తు గర్వంగా తలెత్తుకుంటుందో, ఏ జెండా చూస్తే ఉద్వేగం కలుగుతుందో అదే మువ్వన్నెల జెండా' అని అన్నారు.

**పింగళి తెలుగువారు కావడం గర్వంగా ఉంది**

'ప్రపంచంలోనే అతి శక్తివంతమైన జాతీయ జెండాను మన తెలుగు వ్యక్తి పింగళి వెంకయ్య రూపొందించడం మనందరికీ గర్వకారణం. జెండా అంటే కేవలం ఒక వస్త్రం కాదు. మన దేశ గౌరవం. జాతీయ జెండా చూడగానే మనందరిలో ఉద్వేగం, దేశభక్తి కలుగుతుంది. ఎందరో మహానుభావులు తెలుగునేలపై జన్మించారు. వారి పోరాటపటిమతో మనలో జాతీయస్ఫూర్తిని రగిలించారు. 1857లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటం జరగ్గా అంతకముందే బ్రిటీష్ వారిపై తెలుగు వారు పోరాటం చేశారు. బ్రిటీష్ వారిని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు, తుపాకీ గుళ్లకు గుండె చూపించిన టంగుటూరి, గొట్టిపాటి బ్రహ్మయ్య, సర్దార్ గౌతు లచ్చన్న, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య వంటి స్వాతంత్ర్య సమరయోధులు తెలుగు గడ్డపై పుట్టడం మన అదృష్టం' అని అన్నారు.

**సమగ్రత విషయంలో దేశం ఎవరికీ తలవంచదు**

'దేశ సమగ్రత విషయంలో భారత్ ఎవరికీ తలవంచదు. దేశ క్షేమం, భద్రత విషయంలో మనమంతా ఒకటే. కార్గిల్ యుద్ధం, పహల్గామ్ ఘటన జరిగినప్పుడు దేశ ప్రజానీకం ఒక్క తాటిపై నిలిచింది. నేడు ఉన్నది ధృఢమైన భారత దేశం. విశ్వగురువుగా అవతరిస్తున్న భారతదేశం. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదానికి గట్టిగా బదులిచ్చాం. ఉగ్రవాదుల గుండెల్లో సైనికులు రైళ్లు పరుగెత్తించారు. ఉగ్రవాదంపై అలుపెరుగని పోరాటం చేస్తున్న మన సైనికులకు సెల్యూట్ చేస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**భారత్‌ది గుడ్ ఎకానమీ**

'ప్రధాని మోదీ రూపంలో మన దేశానికి సమర్థవంతమైన నాయకత్వం లభించింది. ఒకప్పుడు మనది పేద దేశం అనేవాళ్లు. 11 ఏళ్ల మోదీ పాలనలో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ 4వ స్థానానికి వచ్చింది. 2028కి 3వ స్థానానికి చేరుతుంది. 2047లో వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకునే నాటికి ప్రపంచంలోనే శక్తివంతంగా మనదేశం నిలుస్తుంది 2047 నాటికి దేశంలో ఏపీ నెంబర్ వన్ రాష్ట్రం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనది డెడ్ ఎకానమీ అన్నారు. ఎవరిది డెడ్ ఎకానమీనో భవిష్యత్ నిర్ణయిస్తుంది. మనపై సుంకాలు వేయడం తాత్కాలికమే. మనది గుడ్ ఎకానమీ. మన భారతీయుల సేవలు ప్రపంచానికి చాలా అవసరం. తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు 1991లో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు. 1995లో ఐటీ విప్లవం వచ్చింది. దాన్ని మనం అందిపుచ్చుకుని ముందుకెళ్లాం. ఐటీని ప్రమోట్ చేసేందుకు హైటెక్ సిటీ కట్టాం. నేడు ఏపీలో క్వాంటమ్ వ్యాలీ తీసుకొస్తున్నాం. యువత ఎక్కువగా ఉండే దేశం మనది. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని స్థిరమైన అభివృద్ధి సాధించే దిశగా ముందుకు వెళదాం'అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# కార్మికుల భద్రత, సంక్షేమమే ధ్యేయం

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** కార్మికుల భద్రత, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, కార్మికుల ఆరోగ్య రక్షణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్ అండ్ వైద్య భీమా సేవల శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈఎస్ఐ వైద్యశాల ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సీఎస్ఆర్ ఫండ్స్ తో ఏర్పాటు చేసిన 2 అంబులెన్స్ లను మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ఈఎస్ఐ వైద్యశాలల్లో 500 ఖాళీలను త్వరలో భర్తీ చేయనున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అలాగే వైద్యశాలల్లో వైద్య పరికరాల కొనుగోలుకు అనుమతులు వచ్చాయన్నారు. ఫ్యాక్టరీల్లో జీరో ప్రమాదాల నివారణకు కూటమి ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే గతేడాది కర్మాగారాల్లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, వాటి నివారణకు పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రపై దృష్టి సారించామని వారికి అవసరమైన సేవలను 24 గంటలు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సేవలను మరింత విస్తృత పరచడంలో భాగంగా ఎస్ బి ఐ సహకారంతో సీఎస్ఆర్ ఫండ్స్ తో ఏర్పాటు చేసిన అంబులెన్స్ లను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కొద్ద రోజుల క్రితం యూనియన్ బ్యాంక్ సహకారంతో రూ. 43 లక్షల విలువైన అంబులెన్స్ ను ఈఎస్ఐ వైద్యశాలకు అందించడం జరిగిందన్నారు. ఈ అంబులెన్స్ ల్లో వెంటిలేటర్, ఈసీజీ తదితర రోగికి అత్యవసర స్థితిని నుంచి రక్షించడానికి అవసరమైన అన్ని పరికరాలు ఏర్పాటు చేయడమైనదన్నారు. కార్మికుల కోసం వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా రాష్ట్రంలో వైద్యశాలలు, 96 డిస్పెన్సరీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రమాదకరమైన రసాయన కర్మాగారాల్లో రికార్డుల మూల్యాంకనం చేయడానికి పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్న్ షిప్ లు కల్పించడానికి, ఫ్యాక్టరీల్లో భద్రకు సంబంధించి విశ్వవిద్యాలయాల నుంచి సాంకేతిక సహకారం తీసుకునేందుకు జెఎన్టీయూ కాకినాడ యూనివర్సిటీతో మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎంఓయూ చేసుకోవడం జరిగింది. ఈ నెల 4 న శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, జేఎన్టీయూ–అనంతపురం, ఏపీ ప్రొడక్టవిటీ కౌన్సిల్ తో కూడా ఒప్పందాలు చేసుకున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ వివరించారు. ఈ ఒప్పందాల్లో భాగంగా పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్నషిప్ కు అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే రాష్ట్రంలోని ప్రమాదకర పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన




చర్యలపై ఆయా కర్మాగారాల కార్మికులకు అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రమాదం జరిగితే రూట్ కాజ్ ఎనాలసిస్ ద్వారా విశ్లేషించి, భవిష్యత్తులో మరోసారి ప్రమాదం జరగకుండ తీసుకోవాల్సిన చర్యలను యూనివర్సిటీ బృందాలు సూచిస్తాయన్నారు. అనంతరం ఎస్ బి ఐ అందించిన రెండు అంబులెన్స్ లను మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు, డైరక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహనరావు, జెన్టీయూ–కాకినాడ రిజిస్ట్రార్ ఆర్. శ్రీనివాసరావు, ఎస్ బి ఐ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సీతాక్ష్మి సింగ్, ఈఎస్ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో గ్రామీణ క్రీడలకు అండగా ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ/ఢిల్లీ, మేజర్ న్యూస్ :** విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జాతీయ క్రీడా పాలన బిల్లు - 2025కు మద్దతు తెలుపుతూ, ఈ బిల్లు "భారతదేశాన్ని నిజమైన క్రీడా శక్తిగా తీర్చిదిద్దే మైలురాయి"గా అభివర్ణించారు. లోక్ సభలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ ఈ బిల్లు పై ప్రసంగిస్తూ..., ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడా శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవియా విజనరీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, బీసీసీఐ వంటి స్వతంత్ర, స్వావలంబన క్రీడా సంస్థలకు ఈ బిల్లు ఇచ్చే ప్రోత్సాహాన్ని కొనియాడారు. బీసీసీఐ గ్రామీణ క్రికెట్ ప్రతిభను జాతీయ వేదికకు తీసుకువచ్చిందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడల అభివృద్ధికి తీసుకున్న దూరదృష్టి చర్యలను ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయ కత్వంలో ఆఫ్రో–ఏషియన్ క్రీడలను విజయవంతంగా నిర్వహించి, ఎనిమిది స్టేడియాలు, అనేక శిక్షణా అకాడమీలను నిర్మించి, హైదరాబాద్‌ను క్రీడా కేంద్రంగా మార్చిన విషయాన్ని ప్రస్తావించారు. అదే విధంగా అమరావతిలో ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివ ర్సిటీ, అలాగే 2024–29 ఏపీ స్పోర్ట్స్ పాలసీని ప్రవేశపెట్టారని, ఈ పాలసీ క్రీడాకారులకు 3% ఉద్యోగ రిజర్వేషన్, దేశంలోనే అత్యధిక నజరానాలను పతక విజేతలకు అందజేస్తుం దని చెప్పారు. గ్రామీణ స్థాయి క్రీడల అభివృద్ధి గురించి మాట్లాడుతూ, యువకుడు, చురుకైన, భవిష్యత్తు పై విజన్ కలిగిన నాయకుడంటూ రాష్ట్ర విద్య ఐటీల శాఖల మంత్రి నారా లోకేష్ ని ఎంపీ కేశినేని శివనాథ్ కొనియాడారు. ఏపీలో ప్రతి ప్రభుత్వ పాఠశాలకు మైదానం, వార్షిక క్రీడా పోటీలు నిర్వహణను లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇందు వల్ల పిల్లలు చిన్ననాటి నుంచే క్రీడలతో మమేకమవుతారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా, తను స్వయంగా 147 ప్రభుత్వ పాఠశాలల మైదానాలను శుభ్రపరిచి ఆడు కునే విధంగా సిద్దం చేయించడమే కాక, తొమ్మిది రకాల క్రీడా కిట్లను పంపిణీ చేసినట్లు వివరించారు. కేంద్రం "ఖేలో ఇండియా" పథకం కింద ప్రాజెక్టుల సంఖ్యను టియర్–2, టియర్–3 నగరాలకు, ముఖ్యంగా విజయవాడకు పెంచాలని ఆయన కోరారు. గ్రామీణ స్థాయిలో 147 పాఠశాల మైదానాల అభివృద్ధి, క్రీడా కిట్ల పంపిణీ వంటి తన కృషిని ప్రస్తావి స్తూ, మంత్రి నారా లోకేష్ ఆలోచనలను మరోసారి ప్రశంసించారు. చివరగా, యువతకు "తగిన వాతావరణం, వనరులు, అవకాశాలు" కల్పించేందుకు ఈ బిల్లును త్వరగా ఆమోదించాలని కోరుతూ, క్రీడలను బలమైన, ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి ప్రధాన శక్తిగా మార్చే తన కట్టుబాటును ఎంపీ కేశినేని శివనాథ్ పునరుద్ఘాటించారు.

# హర్ దిల్ తిరంగా.. హర్ ఘర్ తిరంగా..





**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 11, మేజర్ న్యూస్ :** ప్రతి మదిలో, ప్రతి ఇంటిపైనా దేశభక్తిని చాటిచెప్పేలా మువ్వన్నెల జెండా రెపరెపలాడుతోందని.. ప్రతి గుండె ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పంద్రాగస్టు వేడుకులకు సిద్ధమవుతున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయవాడ ఓల్డ్ జీజీహెచ్ వద్ద జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో విజయవాడ నగరపాలక సంస్థ, రెవెన్యూ, పోలీస్, యువజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు, సిబ్బందితో పాటు వాకర్స్ క్లబ్ వంటి వివిధ అసోసియేషన్ల నుంచి పెద్దఎత్తున ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బైక్, సైకిల్ ర్యాలీతో పాటు స్కేటింగ్ చేస్తూ చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. త్రివర్ణపతాకాలు చేతబూని భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం, ఓల్డ్ జీజీహెచ్ రహదారులు మార్మోగిపోయాయి. అమరవీరుల బలిదానం.. నేటి స్వేచ్ఛా భారతం, త్రివర్ణ పతాకం ఐకమత్యానికి సంకేతం నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సరిహద్దుల్లో మన వీర సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని.. ఆపరేషన్ సిందూర్ మన దేశ సత్తాను చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఏదో ఒక రోజుకి పరిమితం కాకుండా ప్రతి హృదయమూ త్రివర్ణ పతాక ఐక్యతా స్ఫూర్తిని నింపుకొని ప్రతిరోజూ ముందడుగు వేయాలని, ప్రతిఒక్కరూ దేశ సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా వంటి గొప్ప కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నందుకు గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

**ఈ స్వేచ్ఛ.. ఎందరో మహనీయుల త్యాగ ఫలితం: సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు**

మనం నేడు అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో మహనీయుల త్యాగ ఫలితమని.. మనకు స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో రంగాల్లో ముందుకెళ్లామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. దేశమంటే మాతృమూర్తితో సమానమని.. దేశభక్తితో దేశాభివృద్ధికీ ప్రతిఒక్కరూ సమష్టిగా ముందడుగు వేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రగతి పథంలో వడివడిగా ముందడుగు వేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని రాజశేఖరబాబు అన్నారు.

ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, వీఎంసీ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్వాంటం వ్యాలీ అమరావతి ఆవిష్కరణలో ఎల్టిఐ మైండ్ ట్రీ భాగస్వామ్యం

## ఎల్టిఐమైండ్ ట్రీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పారిశ్రామిక భాగస్వాముల సహకారంతో భారతదేశంలోని మొట్టమొదటి క్వాంటం వ్యాలీ అమరావతిలో చేరిక

**అమరావతి ఆగస్టు 11 మేజర్ న్యూస్ :** అమరావతిలో ఇటీవల నిర్వహించిన ఒక కార్యక్రమంలో తన మాతృ సంస్థ అయిన భారతదేశపు ప్రముఖ ఇంజనీరింగ్ & టెక్నాలజీ సంస్థ లార్సెన్ & టుబ్రోతో కలసి అమరావతిని భారతదేశంలోని ప్రప్రథమ క్వాంటం హబ్ గా రూపొందించుటకు గ్లోబల్ టెక్నాలజీ కన్సల్టింగ్, డిజిటల్ సొల్యూషన్స్ కంపెని ఎల్టిఐమైండ్ ట్రీ (ఎన్ఎస్ఇ : ఎల్టిఐఎం, బిఎస్ఇ : 540005) ఒప్పందం చేసుకున్నది. ఈ కలయిక అమరావతి క్వాంటం వ్యాలీని భారతదేశంలోని మొట్టమొదటి క్వాంటం టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయడంలో ఎల్టిఐ మిండ్ ట్రి నిబద్ధతను చాటిచెపుతుంది. ఈ కార్యాచరణ ఎల్టిఐమిండ్ ట్రి, ఎల్ అండ్ టి యొక్క ప్రధాన సాంకేతికత, మౌలిక సదుపాయాల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐబిఎం, వివిధ క్వాంటం పర్యావరణ సంస్థలతో కలిసి ప్రపంచ స్థాయి క్వాంటం టెక్నాలజీ హబ్‌గా అమరావతిని గమ్యస్థానంగా రూపొందించుటకు ఎల్టిఐమిండ్ ట్రి కృషిచేస్తుంది. ఈ పరస్పర సహకార ఒప్పందం ద్వారా, ఎల్టిఐమిండ్ ట్రి క్వాంటం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వినూత్న సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణ కొరకు టెక్ పార్క్ సంస్థలతో కలసి పారిశ్రామిక, సామాజిక ఉన్నతికి వర్తించు ప్రాథమిక శాస్త్ర పరిశోధనలో కీలక భాగస్వామి పాత్రను చేపడుతుంది. ఇక అమరావతి క్వాంటం వ్యాలీ యొక్క మౌలిక సదుపాయాల రూపకల్పన కొరకు అభివృద్ధి, నిర్వహణకు నిర్మాణం రంగంలోని తమ సాంకేతిక నైపున్యతలను వినియోగించుకుని భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టుటకు ఎల్ అండ్ టి నాయకత్వం వహిస్తుంది, ఆస్తుల సృష్టికి దోహదపడుతుంది. ఈ అమరావతి క్వాంటం వ్యాలీ వద్ద కీలక భాగం క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబిఎం వారితో కలసి ప్రణాళిక రూపొందించినది. ఇది భారతదేశంలో ఊహకందని అతి గొప్ప క్వాంటం కంప్యూటర్ అవుతుంది అంటున్నారు. ఇందుకు అవసరమైన అత్యున్నత భవన నిర్మాణాల రూపకల్పన చేయుటకు, ఇబ్బందుల పరిష్కారానికి ఎల్ అండ్ టి సంస్థ ఐబిఎం వారితో కలసి పనిచేస్తుంది. ఈ విశిష్ట ఐకానిక్ కేంద్రం ఏర్పాటుకు ప్రణాళికలు శరవేగంగా రూపొందిస్తూ, ఉజ్వల భవిష్యత్తుకు పటిష్టమైన పునాదులు వేయుటకు సంనద్ధమవుతున్నాయి. ఈ సందర్భంగా వేణు లంబు ఎల్టిఐమిండ్ ట్రి సిఈవో, మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ మా క్వాంటం సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ ద్వారా, ఎల్టిఐమిండ్ ట్రి క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికత పరిశోధన, ఇంక్యుబేషన్‌ను వినూత్నమార్గాలలో నిర్వచిస్తుంది అన్నారు. ఈ ప్రతిష్టాత్మ కమైన ప్రాజెక్టు ఉత్తమ నైపునణ్యతలను పారిశ్రామిక, సామాజిక రంగాలకు వర్తింపచేయుటకు మేము ఎంతో సంతోషిస్తున్నాము అన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీ నేషనల్ క్వాంటం మిషన్‌తో సరిసమానంగా క్వాంటం ప్రయో జనాలు పటిష్ట పరచుట లక్ష్యంగా ముందుకు వెళుతున్నాము అన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీలో ప్రయోజ నాల స్వరూపం :1. క్వాంటం, క్లాసికల్ కంప్యూటింగ్ కోసం అత్యాధునిక ఆర్ అండ్ డి సౌకర్యాలు. 2.విద్యారంగం, స్టార్టప్‌లు, పరిశ్రమ, ప్రభుత్వం కొరకు వర్క్ స్పేస్ (కార్యస్థలం) 3.సంస్థలు, పరిశోధక బృందాల వారికి తగిన ప్రదేశం. 4.సమావేశాలు, హ్యాకథాన్‌లు, వర్క్‌షాప్‌లు, బహిరంగ సదస్సులు నిర్వహణకు ఈవెంట్, కమ్యూనిటీ జోన్‌లు. విద్యా, పరిశ్రామిక, స్టార్టప్, ప్రభుత్వ రంగాలకు క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ సమర్థవంతమైన సహకారాన్ని అందిస్తూ, ఈ రంగంలో భారతదేశాన్ని ప్రపంచ అధినేతగా (లీడర్) నిలబెడుతుంది.

# ‘అన్నదాత సుఖీభవ’తో రైతులకు ఊరట

## మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు.

## కవులూరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం.



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ‘జి.కొండూరు అన్నదాత సుఖీభవ’ అమలుతో రైతులకు కొంత.ఊరట లభించిందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.జి.కొండూరు మండలంలోని కవులూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం కవులూరు సొసైటీలో సోమవారం జరిగింది.చైర్మన్ గా చెరుకూరి గంగాధరరావు, సభ్యులుగా నూతక్కి భారతి, బసవబోయిన సాంబశివరావు బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు కృష్ణప్రసాదు త్రిసభ్య కమిటీని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతులకు విశేష సేవలందించాలని వారికి సూచించారు.రాజకీయాలకు అతీతంగా సొసైటీ సభ్యులకు రుణాలు, పథకాలు అందజేయాలని సూచించారు. వారికి రాయితీపై ప్రభుత్వం నుంచి మంజూరు అయ్యే ఎరువులు, విత్తనాలు, ఇతరత్రా సేవలు అందుబాటులో ఉంచాలన్నారు.అన్నదాతలకు ఎటువంటి సమస్యలున్నా తక్షణమే స్పందించాలని వారికి సూచించారు. సభ్యులకు సేవలందించడంలో మంచి పేరు తెచ్చుకుని రైతుల అభిమానాన్ని చూరగొనాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# జియోహాట్‌స్టార్, సన్ ఎన్ఎక్స్ టిలలో పీరమల్ ఫైనాన్స్ యొక్క సమీక్ష ప్రసారం




**విజయవాడ, ఆగస్టు 11, మేజర్ న్యూస్ :** పీరమల్ ఫైనాన్స్ యొక్క ‘సమీక్ష’ ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్న వినియోగదారుల నిజ జీవిత కథలను సమర్పిస్తూ, ఆర్థిక చేరికను ప్రోత్సహించడంలో, దేశవ్యాప్తంగా వ్యక్తులు, చిన్న వ్యాపారాలను శక్తివంతం చేయడంలో కంపెనీ యొక్క అచంచల నిబద్ధతను హైలైట్ చేస్తుంది. ఆర్థిక అవగాహనను మరింత చేరువ చేసేందుకు ఈ చొరవ పీరమల్ ఫైనాన్స్ లక్ష్యాన్ని బలోపేతం చేస్తోంది. ఓటిటి ప్లాట్‌ఫామ్‌లలో ‘సమీక్ష’ ప్రారంభించటం ద్వారా, సంస్థ ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశవ్యాప్తంగా విస్తృత ప్రేక్షకులకు ఈ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకురావడాన్ని ల క్ష్యంగా పెట్టుకుంది, వీక్షకులకు సౌలభ్యం, సౌకర్యాన్ని అందించాలనే ఉద్దేశం తో ముందుకు సాగుతోంది. ‘హమ్ కాగజ్ సే జ్యాదా నీయత్ దేఖతే హై’ అనే నమ్మకంతో రూపొందించిన సమీక్ష, సరైన మార్గదర్శకత్వం, పట్టుదలతో తమ జీవితాలను మార్చుకున్న సాధారణ వ్యక్తుల స్ఫూర్తిదాయక ఆర్థిక ప్రయాణాలను హైలైట్ చేస్తుంది. ఓటిటి ప్లాట్‌ఫామ్‌లలో ప్రారంభించడంతో, పీరమల్ ఫైనాన్స్ మరింత విస్తృతమైన ప్రేక్షకులను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది, ముఖ్యంగా సంస్థ తన బలమైన కనెక్షన్లను నిర్మించుకున్న ఆంధ్రప్రదేశ్‌లో బ్రహ్మాజీ నిర్వహించిన హృదయపూర్వక, స్ఫూర్తిదాయకమైన ఇంటర్వ్యూలో, కాసోజు చారి జీవిత ప్రయాణం కేంద్రబిందువుగా నిలిచింది. తన సొంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు ఆయన చూపిన దృఢ సంకల్పం, నైపుణ్యం, అభిరుచిని బ్రహ్మాజీ చక్కగా ప్రస్తావించారు. ఆ లోతైన సంభాషణలో, కాసోజు చారి తన కలల ఇంటిని సాకారం చేసుకునే దిశగా చేసిన శ్రమ, ఎదుర్కొన్న సవాళ్ళు, పొందిన విజయాన్ని భావోద్వేగపూరితంగా పంచుకున్నారు. సమీక్ష యూట్యూబ్, జియోహాట్‌స్టార్, సన్ ఎన్ఎక్స్ టి ఓటిటి ప్లాట్‌ఫామ్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడటం ద్వారా, విస్తృత ప్రేక్షకులతో కనెక్ట్ అవుతుంది అలాగే ఆర్థిక చేరిక సందేశాన్ని విస్తరిస్తుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగదీప్ మల్లారెడ్డి, చీఫ్ బిజినెస్ ఆఫీసర్, పీరమల్ ఫైనాన్స్ ఇలా అన్నారు, “మిస్టర్ చారి వంటి కథలు అభివృద్ధి చెందుతున్న భారతదేశం యొక్క ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. చిన్న పట్టణాల నుండి వచ్చిన, నైపుణ్యంతో ఎదిగిన స్వీయ-నిర్మిత వ్యక్తులు తమ పురోగతి పట్ల గర్వపడతారు. సమీక్ష వంటి కార్యక్రమాలు ఈ ప్రేరణాత్మక ప్రయాణాలను హైలైట్ చేయడమే కాదు, ఇంటి యాజమాన్యం వంటి ఆర్థిక లక్ష్యాలు వ్యక్తిగత విజయ చిహ్నాలుగా ఎలా మారుతాయో కూడా చూపిస్తాయి.” 4.2 మిలియన్లకు పైగా కస్టమర్లకు సేవలు అందిస్తూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న జాతీయ ఎన్.బి.ఎఫ్.సి. లలో ఒకటిగా, 1,000కు పైగా ప్రదేశాల్లో బలమైన ఉనికితో, పీరమల్ ఫైనాన్స్ ఆంధ్రప్రదేశ్ వంటి మార్కెట్లలో అపారమైన అవకాశాలను చూస్తోంది. ‘సమీక్ష’ కేవలం కథ చెప్పే మాధ్యమం మాత్రమే కాదు, ఇది నమ్మకాన్ని పెంపొందించడానికి, స్థానిక ఆకాంక్షలను లోతుగా అర్థం చేసుకోవడానికి,, అభివృద్ధి చెందుతున్న భారతదేశం యొక్క అసలైన అవసరాలకు సమీపంగా ఉండటానికి శక్తివంతమైన మార్గాన్ని సూచిస్తుంది. అరవింద్ అయ్యర్, మార్కెటింగ్ హెడ్, పీరమల్ ఫైనాన్స్ ఇలా అన్నారు, “సమీక్ష కేవలం ఓ సిరీస్ మాత్రమే కాదు, ఇది మా కస్టమర్లను కాగితపు పనులకు మించి అర్థం చేసుకోవాలనే మా లోతైన నిబద్ధతకు ప్రతిబింబం. ఇది వారి నిజమైన ఉద్దేశాలు, ఆశయాలను గుర్తించడంపైనే కాకుండా, సంఖ్యల వెనుక ఉన్న మానవత్వాన్ని చూడడంపైనా ఉంది. ఇవి అనుకూల పరిస్థితులు లేనప్పటికీ, ఆర్థిక సాధికారత వైపు ఆ మొదటి అడుగు వేసి తమ కలలను నిజం చేసుకునే వ్యక్తుల అసలైన కథలు.”

# శాంసంగ్ గెలాక్సీ జెడ్ ఫ్లిప్7, జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఈపై ఉత్తేజకరమైన ఆఫర్లు




**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, ఇటీవల ప్రారంభించిన గెలాక్సీ జెడ్ ఫ్లిప్7, జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఈపై ఉత్తేజకరమైన పరిమితకాల ఆఫర్లను ప్రకటించింది. కొత్త ఆఫర్లతో, రూ. 12 వేల వరకు బ్యాంక్ క్యాష్‌బ్యాక్ లేదా అప్‌గ్రేడ్ బోనస్‌తో, గెలాక్సీ జెడ్ ఫ్లిప్7 కేవలం రూ. 97,999కే లభిస్తుంది. అదేవిధంగా, రూ. 10 వేల వరకు బ్యాంక్ క్యాష్‌బ్యాక్ లేదా అప్‌గ్రేడ్ బోనస్‌తో, గెలాక్సీ జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఈ కేవలం రూ. 85999కే లభిస్తుంది. గెలాక్సీ జెడ్ ఫ్లిప్7, జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఈ కొనుగోలు చేయాలనుకునే వినియోగదారుల కోసం ఈ డీల్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చడానికి, బ్యాంక్ క్యాష్‌బ్యాక్, అప్‌గ్రేడ్ బోనస్ ఆఫర్‌లను 24 నెలల నో-కాస్ట్ ఈఎంఐ ఆప్షన్‌తో కలిపి పొందవచ్చు.

# క్రోమా ఎలక్ట్రానిక్ స్టోర్ ఆవిష్కరణ

## మీ అభిమాన ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై ఫ్లాట్ 15% తగ్గింపు




**మచిలీపట్నం ఆగస్టు 11 మేజర్ న్యూస్ :** టాటా గ్రూప్ యొక్క భారతదేశపు ప్రముఖ ఓమ్ని-ఛానల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్- క్రోమా, తమ మొదటి స్టోర్‌ను మచిలీపట్నంలో ఈరోజు అత్యంత వైభవంగా ప్రారంభించారు.సుమారు 8,000 చ.అ.విస్తీర్ణంలో రామానాయుడు పేట, మచిలీపట్నం వద్ద ఆవిష్కరించారు, ఇది రాష్ట్రంలో 19వ స్టోర్. ఆంధ్రప్రదేశ్ అంతటా తమ ఉనికిని బలోపేతం చేయుటకు ఇది ఒక మైలురాయిగా నిలుస్తుంది. కలంకారి కళలు, చేనేత వారసత్వ సంపద, పేరొందిన మంగినపూడి బీచ్ అందాలు, చారిత్రాత్మకమైన లైట్ హౌస్ కలిగిన అత్యంత ఆకర్షణీయమైన చిలకలపూడి బంగారు ఆభరణాలకు పేరొందిన సంస్కృతిక సంప్రదాయాలకు నెలవైన పోర్ట్ నగరంలో ప్రపంచ శ్రేణి ఎలక్ట్రానిక్ షాపింగ్ అనుభూతిని కలిగించే క్రోమా స్టోర్ ఆవిష్కరణ జరిగినది. మచిలీపట్నం, పరిసర ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని రకాల అధునాతన వినియోగదారుల ఎలక్ట్రానిక్ వస్తువులు, స్మార్ట్ హోమ్ సొల్యూషన్స్, గృహోపకరణాలు, వ్యక్తిగత ఉపకరణాలు అన్ని ఈ స్టోర్‌లో ఒకే చోట లభిస్తాయి. క్రోమా స్టోర్ ఆవిష్కరణ సందర్భంగా ఇన్ఫినిటీ రిటైల్ లిమిటెడ్ ప్రతినిధి మాట్లాడుతూ, మా క్రోమా స్టోర్ మచిలీపట్నంలో ఆరంభించటం చాల గర్వంగా ఉంది అన్నారు. ఈ చారిత్రాత్మక నగరంలో మా స్టోర్ ఆవిష్కరించటం వలన ఈ ప్రాంత ఖాతాదారులను మేము చేరుకోగాలిగాము అన్నారు. ఈ ప్రసిద్ధ నగరానికి మా నాణ్యమైన ఎలక్ట్రానిక్ పరికరాలను, మా విశ్వసనీయమైన సేవలను ఖాతాదారులకు అందించటం మాకు చాల సంతోషం కలిగిస్తున్నాది. ఈ స్టోర్ ద్వారా వినియోగదారులకు ఉత్తమమైన, సంతృప్తికరమైన ప్రపంచ స్థాయి షాపింగ్ అనుభవం కలుగుతుందని విశ్వసిస్తున్నాము అని చెప్పారు. ఈ నూతన స్టోర్ ఆవిష్కరణ సందర్భంగా ఖాతాదారులకు అనేక ప్రత్యేక రాయితీలను ప్రకటించారు. 11 ఆగస్టు నుండి 24 ఆగస్టు వరకు రూ.4,000/- వరకు ఫ్లాట్ తగ్గింపు. 25 ఆగస్టు నుండి 9 సెప్టెంబర్ వరకు రూ.2,500/- వరకు ఫ్లాట్ తగ్గింపు. అంతేకాక ఎంపిక చేసిన వస్తువులు పైన వడ్డీ లేని ఈఎంఐ సదుపాయం అందుబాటులో కలదు. ఎంపిక చేసిన బ్రాండ్‌లు, ఉపకరణాలు, శ్రేణులుకు మాత్రమే ఆఫర్ వర్తిస్తుంది. నిబంధనలు, షరతులు వర్తిస్తాయి. ప్రతిరోజూ ఉదయం 11:00 నుండి రాత్రి 9:00 గంటల వరకు స్టోర్ తెరిచి ఉంటుంది. ఉత్పత్తుల వివరాలు, సర్వీసెస్ వివరాలు, ఆవిష్కరణ సందర్భంగా ఆఫర్ల వివరాలకు, కొత్త క్రోమా స్టోర్‌ను సందర్శించండి లేదా వెబ్ సైట్ www.croma.comనకు లాగిన్ అవ్వండి.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 73 ఫిర్యాదులు

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి 13.00 గంటల వరకు ఎన్. టి. ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ నేపథ్యం లో సోమవారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాలు మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 73 ఫిర్యాదులపై బాధితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓలతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడమైనది. అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలకు, ఆస్తి వివాదాలకు, నగదు లావాదేవీలకు సంబంధించినవి 36, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 07, కొట్లాటకు సంబంధించినవి 03, వివిధ మోసాలకు సంబంధించినవి 03, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి 05, దొంగతనాలకు సంబంధించి 03, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 16, మొత్తం 73 ఫిర్యాదులును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

## ఎటువంటి సమస్య తలెత్తనివ్వకూడదు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను, విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం నిర్వహించారు. ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 13 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 10, ఇంజనీరింగ్ 1, రెవిన్యూ 1పబ్లిక్ హెల్త్ 1 మొత్తం కలిపి 13 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జున రావు, పర్యవేక్షణ ఇంజనీర్లు పి. సత్యకుమారి, పి. సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పైప్ లైన్ పనులను పరిశీలించిన చైర్మన్ కృష్ణకుమారి



**నందిగామ, ఆగస్టు 11, మేజర్ న్యూస్:** ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశానుసారం నందిగామ పట్టణ పరిధిలోని డ్రైనేజ్ పూడికతీత పనులను, మంచినీటి సరఫరా చేసే అంతర్గత పైపులైను పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మత్తులు నోచుకోకుండా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య పట్టణ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారని అతి త్వరలోనే ఏఐఐబి పథకం ద్వారా పట్టణ పరిధిలోని త్రాగునీరు అందించే విధంగా రూపకల్పన చేస్తున్నామని తెలియజేశారు.

# అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపండి...

### జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. పెండిరగ్ బియాండ్ ఎస్ఎల్ఏ రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు పెండిరగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కర వేదికకు వచ్చే వినతులను అధికారులు ఎప్పటికప్పుడు లాగిన్లో పరిశీలించి పరిష్కరించాలన్నారు. రీఓపెన్ కేసులను కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని, గడువులోగా వినతులకు సమాధానాలు పంపాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు.

**126 అర్జీలు స్వీకరణ:** రెవెన్యూ శాఖకు సంబంధించి 36, పోలీస్ 20, డిఇఒ 16 వివిఎంసి 9, సర్వే 7 ఏపిసిపిడిసిఎల్ 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు 4, విభిన్నప్రతిభావంతులు 3, డిఎంహెచ్వో 3, డిఆర్డిఏ 3, పౌరసరఫరాలు 2, ఎంపిడిఓ 2, ఆర్ఐవో (ఇంటర్మీడియట్) 2, పశుసంవర్థక, ఏపిఎస్డబ్ల్యు ఆర్ఇఐఎస్, డిసిహెచ్ఎస్, డిసివో (సహకార శాఖ), జిల్లా జలవనరులు, ఎక్సైజ్ పోలీసు, మత్స్య, అటవీ, జిజిహెచ్, హౌసింగ్, పరిశ్రమలు, మైనారిటీ, ఆర్అండ్బి, సోషల్ వెల్ఫేర్ కు సంబంధించి ఒక్కొక్క అర్జీతో కలిపి మొత్తం 126 అర్జీలు స్వీకరించడం జరిగింది. ఇందులో 54 అర్జీలు స్వయంగాను 72 అర్జీలు ఆన్లైన్ ద్వారా స్వీకరించిన్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఎం. లక్ష్మీనరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కెఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. పోసిబాబు, ఏసిపి కె. వెంకటేశ్వరరావు వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల నుండి అందే అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలి

### జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖరరావు




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల నుండి అందే అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖరరావు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఆర్ఓ, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, మచిలీపట్నం ఆర్ డి ఓ స్వాతి, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజులతో కలిసి మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్లో మొత్తం 103 అర్జీలు జిల్లా యంత్రాంగం స్వీకరించింది. అంతకు మునుపు డిఆర్ఓ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో జారీచేసిన సర్కులర్లు, నోటిఫికేషన్లు, మెమోలు, ఉత్తర్వులు, తదితర డాక్యుమెంట్లు అన్ని రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ ఆర్టిజిఎస్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు గుర్తుచేస్తూ మొన్నటి వరకు రెండవ స్థానంలో ఉన్న కృష్ణా జిల్లా నేడు 7 వ స్థానానికి పడిపోయిందని, ఇకనైనా అధికారులందరూ చొరవ తీసుకొని వారి కార్యాలయానికి సంబంధించిన డాక్యుమెంట్లను వెంటనే అప్లోడ్ చేసి అగ్రస్థానంలో నిలవాలని సూచించారు. ఈనెల 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మంత్రి సందేశం తయారు చేయుటకు అవసరమైన ప్రగతి నివేదికలను సంబంధిత అధికారులు వెంటనే అందజేయాలన్నారు.గంజాయి వంటి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టి 5 సంవత్సరాలు అయిన సందర్భంగా విద్యార్థుల చేత నాటకాలు, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించాలని అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు పోర్టల్ లో అప్లోడ్ చేసేందుకు పంపించాలన్నారు. ఈనెల 13వ తేదీన సామూహికంగా ప్రతిజ్ఞ చేసే కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉందన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖలు వారి వద్ద ఉన్న ఉద్యోగుల ఖాళీలు కలెక్టరేట్ కు నోటిఫికేషన్ చేసిన తర్వాతనే కారుణ్య నియామకాల చేపట్టి వారికి అభ్యర్థులను కేటాయిస్తున్నామని అయితే ఆ అభ్యర్థులకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వకుండా పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నట్లు చాలా ఫిర్యాదులు అందుతున్నాయని, ఇది సరైన పద్ధతి కాదంటూ ఇకనైనా పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడంలో ఎటువంటి జాప్యం చేయరాదని స్పష్టం చేస్తూ ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్ డ్వామా, డి ఆర్ డి ఏ, ఐసిడిఎస్ పిడి లు శివ ప్రసాద్, హరిహరనాథ్, ఎం ఎన్ రాణి, డిపిఓ జే అరుణ, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు, పౌరసరఫరాల సంస్థ డిఎం శివరాం ప్రసాద్, డిఎస్ఓ మోహన్ బాబు, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, డిఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ట ఉద్యాన అధికారి జే.జ్యోతి, పశుసంవర్ధక శాఖ అధికారి మత్స్యశాఖ అధికారులు చిన్న నరసింహులు, నాగరాజా తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అవనిగడ్డ విద్యార్థులు




**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా కలెక్టరేట్ లో జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు అవనిగడ్డ యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు 50 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ,యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. వాతావరణ మార్పులకు కారణమైన అంశాలను నుండి ఎలా రక్షించుకోవాలి, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిర్మూలన, నీటి, గాలి కాలుష్య నియంత్రణల కు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే యూత్ క్రాస్ వాలంటీర్ లు తమ ఇంటి సమీపంలోని వారికి ఆయా అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా 100మంది యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లకు టీ షర్ట్లు, క్యాపులు రాష్ట్ర రెడ్ క్రాస్ యూనిట్ నుండి అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సెక్రెటరీ భవిరి శంకరనాథ్, కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ యూనిట్ సమన్వయకర్త ఎస్ హరికృష్ణ,అవనిగడ్డ రెడ్ క్రాస్ సభ్యులు కొండవీటి ఈశ్వరరావు. కళాశాల యూత్ రెడ్ క్రాస్ క్లైమేట్ చేంజ్ యాక్షన్ ప్లాన్ కోఆర్డినేటర్ డా.ఏ.వీర కుమారి పాల్గొన్నారు.

## "క్రీడల మానవ వనరుల అభివృద్ధి" కింద

# లబ్ధిదారులు లేరు

### ఆంధ్రప్రదేశ్ నుంచి సరైన ప్రతిపాదనలు అందలేదు

### కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా వెల్లడి

**విజయవాడ/ఢిల్లీ, మేజర్ న్యూస్ :** గత మూడు సంవత్సరాలలో కేంద్రం అమలు చేస్తున్న "క్రీడల మానవ వనరుల అభివృద్ధి" పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎవరికీ ఫెలోషిప్, సదస్సు లేదా పరిశోధన నిధులు లభించలేదని లోక్‌సభలో కేంద్ర క్రీడల మంత్రి డా. మాన్సుఖ్ మాండవియా వెల్లడించారు. లోక్ సభలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ క్రీడలలో మానవ వనరుల అభివృద్ధి పై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ను ప్రశ్నించగా, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా లిఖిత పూర్వంగా బదులిచ్చారు. ఈ పథకం ద్వారా క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులు, పరిశోధకుల నైపుణ్యాలు, జ్ఞానం పెంచడానికి ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని, 2022-23 నుండి 2024-25 వరకు దేశవ్యాప్తంగా కేవలం ఇద్దరే ఫెలోషిప్ పొందగా, వారిలో ఎవరూ ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వారు లేరనే విషయాన్ని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. గత మూడు ఏళ్లలో దేశవ్యాప్తంగా 2 ఫెలోలు, 47 సదస్సులు, 12 పరిశోధన ప్రాజెక్టులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ పథకం డిమాండ్ ఆధారంగా నడుస్తుందని, అందిన ప్రతిపాదనల ప్రకారమే నిధులు కేటాయిస్తామని మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సరైన ప్రతిపాదనలు అందకపోవడం వల్ల ఈ రాష్ట్రానికి లబ్ధిదారులు లేనట్లు స్పష్టమవుతోందన్నారు.

## శ్రీ మహాదేవ హాస్పిటల్ సామాన్యులకు అందుబాటులో ఆధునిక వైద్య సేవలు




**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మైలవరం చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు వైద్యులుగా సూపరిచితులు డాక్టర్ జి.హరిప్రసాద్ రెండు దశాబ్దాలుగా గతంలో సుకన్య పాలీ క్లినిక్, ప్రస్తుతం శ్రీ మహదేవ్ హస్పుటల్ ద్వారా వైద్య సేవలు అందిస్తూన్నారు. ముఖ్యంగా గత ఆరు ఏళ్లుగా శ్రీ మహదేవ్ హస్పటల్ నిర్వాహకులు, వైదులుగా ఈ ప్రాంతంలో అత్యాధునిక వైద్య సేవలైన లాపరోస్కోపి,ఇండోస్కోపి,ఐసీయు లాంటి సేవలను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారు.తన వైద్య సేవలు మరింత విస్తరించి గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో మైలవరం నడిబొడ్డులో తన సొంత స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి, అన్ని సౌకర్యాలతో మరిన్ని విభాగాలను విస్తరించి,ఆధునిక యంత్ర పరికారాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించనున్నారు. నిరుపేదలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

**లభించు వైద్యసేవలు..** జనరల్ అండ్ లాపరోస్కోపిక్ సర్జరీ, గైనిక్ అండ్ ప్రసూతి సర్జరీ,ట్రామ అండ్ ఆర్థోపెడిక్, ఇ.ఎన్.టి, న్యూరాలజీ, యురాలజీ, కార్డియాలజీ,నెఫ్రాలజి లాంటి వైద్య సేవలు నూతనంగా నిర్మించిన శ్రీ మహదేవ్ హాస్పిటల్ ద్వారా అందించనున్నారు.

**ఈ నెల 13న ప్రారంభం..** అన్ని హంగులు,ఆధునిక యాత్ర పరికరాలతో ఏర్పాటు చేసిన శ్రీ మహదేవ్ హాస్పిటల్ ను ఈ నెల 13న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్,ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్,ద్వారక తిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్.వి.సుధాకరరావు లు ముఖ్యఅతిథిలుగా హాజరై ప్రారంభించనున్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు-అంకురార్పణ

**నాగాయలంక మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలోని శ్రీ ప్రసన్న గణపతి 68 వ వినాయక నవరాత్రి వార్షిక మహోత్సవ శంకుస్థాపనలో భాగంగా సోమవారం చిట్టా. హరే కృష్ణ-వాణి దంపతులు,వారి కుటుంబ సభ్యులు పూజాది కార్యక్రమం నిర్వహించి ఆచారం ప్రకారము చలువ పందిరి స్తంభము పాతినారు. పూజా కార్యక్రమంలో గుడి పూజారి సాయి నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉత్సవ కమిటీ సభ్యులైన విస్సంశెట్టి రాము మానేపల్లి శ్రీనివాసరావు గడ్డిపాటి ప్రసాద్, రామకృష్ణ విచ్చేశారు.

# యూరియా కొరకు పిఎసిఎస్ గోడౌన్లవద్ద రైతన్నల పడిగాపులు



### ఎంఎల్ఏ వెనిగండ్ల రాము చొరవతో 110 మెట్రిక్ టన్నుల యూరియా

### అరగంటలోనే యూరియా అయిపోయిందనడంతో చిన్న, సన్నకారు రైతుల నిరాశ

### మండల వ్యవసాయ అధికారి, కౌతరం పిఎసిఎస్ తీరుపై రైతన్నల నిరసన

**గుడ్లవల్లేరు ఆగస్టు 11 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలో ప్రాథమిక సహకార సంఘాలు యూరియా కొరతను సృష్టిస్తున్నాయి. దీంతో చిన్న రైతులు పిఎసిఎస్ గోడౌన్ల వద్ద ఆందోళన బాట పట్టారు. స్థానిక గుడివాడ ఎంఎల్ఏ వెనిగండ్ల రాము వ్యవసాయ అధికారులతో సమావేశమై యూరియా కొరత రాకుండా వుండేందుకు ప్రత్యేక చొరవ చూపి గుడ్లవల్లేరు మండలంలోని ప్రాథమిక సహకార సంఘాలకుగాను 400 మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్ పెట్టారు. అందులో మండలంలోని ఐదు ప్రాథమిక సహకార సంఘాలకు ఆదివారం 70 మెట్రిక్ టన్నులు(1400 కట్టలు), సోమవారం మూడు ప్రాథమిక సహకార సంఘాలకు 50 మెట్రిక్ టన్నులు(1000 కట్టలు) మొత్తం 2400 యురియా కట్టలు వచ్చినా సన్న, చిన్నకారు రైతులకు నిరాశే ఎదురైంది. ఎకరాకు అర కట్ట చొప్పున 20 మందికో 30 మందికో యిచ్చి అరగంటలోనే స్టాక్ అయిపోయిందంటున్నారంటూ రైతులు ఆవేదన చెందారు. దీంతో కౌతరం పిఎసిఎస్ వద్ద సోమవారం చిన్న రైతులు ఆందోళన చేపట్టారు. కనీసం ఏ ప్రాథమిక సహకార సంఘానికి ఎంతెంత యూరియా దిగుమతి చేస్తున్నారన్న సమాచారం గ్రామాల్లో రైతులకు తెలిసేలా ముందస్తు ప్రకటనచేయకుండా, పర్యవేక్షణచేయకుండా, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ రైతులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక సహకార సంఘాలు యిష్టానుసారంగా వ్యవహరిస్తుండడంపై, యూరియా కట్టకు 100 రూపాయలు అదనంగా బహిరంగ అమ్మకాలు జరుగుతుండడంపై రైతులు నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం, అధికారులు యూరియా కొరతను తీర్చి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రాష్ట్రంలో పి4 దత్తతలో గుడ్లవల్లేరు మండలం ఆదర్శం



### 192 మార్గదర్శులు 2520 బంగారు కుటుంబాల దత్తత పూర్తి

### 100 శాతం దత్తతపై కార్యదర్శులు, మార్గదర్శులకు ఎంపిడిఓ అభినందన

**గుడ్లవల్లేరు ఆగస్టు 11 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మొత్తం 2,520 "బంగారు కుటుంబాల"ను మార్గదర్శులు విజయవంతంగా దత్తత తీసుకున్నారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండి ఇమ్రాన్ తెలిపారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పి4 సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఇమ్రాన్ మార్గదర్శులు బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. దీంతో కార్యదర్శులు మొత్తం 192 మంది మార్గదర్శులు మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఉన్న 2520 ప్రతి బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవడం ద్వారా ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలులో గుడ్లవల్లేరు మండలం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. ఈ విజయానికి కృషి చేసిన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మార్గదర్శులు, సంబంధిత సిబ్బందికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండి ఇమ్రాన్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను నెరవేర్చుతున్న కూటమి ప్రభుత్వం

### మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు.

### మైలవరం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం.



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం మైలవరంలో జరిగింది. చైర్మన్ గా కరెడ్ల వెంకట నారాయణ సభ్యులుగా ఒరుగు వెంకటేశ్వరరావు, భూక్యా కుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. సొసైటీలో త్రిసభ్య కమిటీని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా మైలవరం ప్రధాన సెంటర్లో అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడినుంచి పాదయాత్రతో భారీ ర్యాలీగా సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ పార్టీకి ఎప్పటినుంచో విధేయులుగా ఉంటూ సేవలందిస్తున్న, ఎంతో అపార అనుభవం కలిగిన కరెడ్ల వెంకట నారాయణని సొసైటీ త్రిసభ్య చైర్ పర్సన్ గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చుతున్నట్లు వెల్లడించారు. సూపర్-6 పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని చెప్పారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు తొలి విడత రూ. ఏడు వేలు బ్యాంకు ఖాతాలకు ఇప్పటికే జమ చేసినట్లు తెలిపారు. కర్షకులకు పెట్టుబడి సహాయం అందించినట్లు తెలిపారు. ఈనెల 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలు పెంచినట్లు తెలిపారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు తెచ్చి విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి జరుగుతుందన్నారు.

#### మృతుని కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేత

గతంలో మైలవరం పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడు పజ్జూరు శివన్నారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు టీడీపీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా కింద రూ.5లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన సొమ్మును ఎమ్మెల్యే కృష్ణప్రసాదు బాధిత కుటుంబానికి చెక్కు రూపంలో సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేనేతలకు చేయూతే లక్ష్యం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మనిషికి సంస్కృతిని నేర్పిన చేనేత వృత్తిని కాపాడుకోవడానికి ప్రభుత్వం నిత్యం తపిస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని చిన్నాపురం గ్రామంలో చేనేత కార్మికులతో కలిసి 100 అడుగు చీరతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హ్యాండ్ లూంకు 200 యూనిట్లు, పవర్ లూంకు 500 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం చేనేత కాలనీలో బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హ్యాండ్ లూమ్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అము చేసినందుకు రాష్ట్ర వ్యాప్తంగా చేనేత వర్గాలు ధన్యవాదాలు తెలుపుతూ ర్యాలీలు నిర్వహించడం సంతోషంగా ఉంది.రాష్ట్రం గత ఐదు సంవత్సరాలు ఎదుర్కొన్న గడ్డు పరిస్థితుల నుండి అభివృద్ధి బాటలో నడిపించుకుంటున్నాం. దేశ చరిత్రలోనే కనీ వినీ ఎరుగని రీతిలో 94శాతం సీట్లు సాధించుకున్నాం. ప్రజలు నమ్మి అందించిన అధికారాన్ని ప్రజల సంక్షేమం కోసమే వినియోగిస్తామని భరోసా ఇస్తూముందుకు సాగుతున్నాం.గతంలో రాష్ట్ర ఆస్తుల్ని అమ్మి, తాకట్టు పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. చివరికి మద్యం భవిష్యత్ ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఆదాయం లేక అవస్థలు పడుతున్నప్పటికీ.. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం.చేనేత కార్మికులకు హ్యాండ్ లూం కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూం కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. యాంత్రీకరణ పెరిగిపోవడంతో చేనేత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి ఇబ్బందుల్ని గుర్తించి.. చేనేత కార్మికులకు చేనేత భరోసా ద్వారా ప్రతి సంవత్సరంకి రూ.25 వేల చొప్పున ఇవ్వబోతున్నాం. అదే సమయంలో త్రిఫ్ట్ ఫండ్ కూడా పున:ప్రారంభించనున్నాం. పాత బకాయిలు రూ.5 కోట్లు కూడా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.మనిషికి సంస్కృతిని పరిచయం చేసింది చేనేతలే. అలాంటి వృత్తిని కాపాడుకోవడం కోసం ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. అదే సమయంలో చేనేతలను ఆదుకోవడం కోసం ప్రతి శనివారం చేనేత వస్త్రాలు మాత్రమే ధరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అర్హులైన మత్స్యకారులకు రూ20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాం. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం, బార్లలో 10 శాతం కేటాయించాం. లైసెన్సు ఫీజులో కూడా సగం సబ్సిడీ కల్పించాం. నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు విద్యుత్ సబ్సిడీని 200 యూనిట్లకు పెంచాం. కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించడం ద్వారా బడుగు బలహీన వర్గాల వారిని పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు కట్టుబడి పని చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల బుల్లయ, నాని, కాగిత వెంకటేశ్వరావు, సత్యనారాయణ, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేతివృత్తులకు 'రిలయన్స్' చేయూత

**విజయవాడ, ఆగస్టు 11, మేజర్ న్యూస్ :** చేతివృత్తులకు 'రిలయన్స్' చేయూత అందిస్తోంది. రిలయన్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'క్రాఫ్ట్స్ ఆఫ్ ఇండియా' ద్వారా 24 రాష్ట్రాలలో 2,500 పైగా విక్రేతలతో కలిసి పని చేస్తూ.. 50 వేల మందికి పైగా చేతివృత్తిదారులకు సాధికారత కల్పిస్తోంది. ఆదివాసీ సమూహాలు, చేతి వృత్తిదారులు,, మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాపారుల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించడం దీని ప్రత్యేకత. ఆధునిక రిటైల్ వేదికల ద్వారా భారతదేశం వైవిధ్యమైన కళా సంప్రదాయాలను ప్రోత్సహించడం, చేతివృత్తిదారులకు ఉపాధి అవకాశాలు కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. మార్కెట్ యాక్సెస్, ఉత్పత్తుల అభివృద్ధికి సూచనలు, ప్యాకేజింగ్, రిటైల్ ఫార్మాట్లలో విస్తృత స్థాయిలో అవకాశాలు కల్పిస్తూ రిలయన్స్ రిటైల్ తోడ్పడుతోంది. ఇవన్నీ సంప్రదాయ నైపుణ్యాలను కాపాడడమే కాకుండా, ప్రాంతీయ ఉత్పత్తులు మరింత మంది వినియోగదారులకు చేరవేయడం లక్ష్యం. రిలయన్స్ వార్షిక నివేదికలో తన నిబద్ధతను చాటి చెప్పింది. శక్తి పొదుపు సదుపాయాల వినియోగం, పర్యావరణానికి అనుకూలమైన ప్యాకేజింగ్ వాడకాన్ని అన్ని కార్యకలాపాల్లో పెంచుతోంది. విస్తృతమైన ఎకోసిస్టమ్‌లో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్ 'స్వదేశ' వేదిక ద్వారా వారసత్వ కళలను పునరుద్ధరించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. వాటిలో మహారాష్ట్రకు చెందిన శతాబ్దాల నాటి పైథానీ చీరలు ఒకటి. ఈ చీరలు అత్యుత్తమ పట్టు, సున్నితమైన అల్లికతో ప్రసిద్ధి చెందాయి. డిజిటల్ వాణిజ్య వేదిక జియోమార్ట్ ద్వారా 'క్రాఫ్ట్ మేళా', రాష్ట్ర ఎంపోరియం ద్వారా వినియోగదారులకు నేరుగా ఉత్పత్తులను అందిస్తోంది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖతో స్వయం సహాయక సంఘాలను జియోమార్ట్‌లో నమోదు చేయిస్తుంది. వీరికి శిక్షణ, మార్కెటింగ్, యాక్సెస్ కల్పిస్తోంది. ఈ ప్రయత్నాలు రిలయన్స్ రిటైల్ బహుముఖ దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వాణిజ్యాన్ని సామాజిక ప్రభావంతో, రిటైల్ ఆవిష్కరణను సాంస్కృతిక పరిరక్షణతో మిళితం చేస్తూ ముందుకు సాగుతోంది.

## బిర్లాను లీక్‌ప్రూఫ్ పైప్స్ నూతన సాంకేతిక మార్కెటింగ్ ప్రచారం




విజయవాడ, ఆగస్టు 11, మేజర్ న్యూస్ :బహుళ బిలియన్ డాలర్ల విలువ గల సీకేపీ బిర్లా గ్రూప్ లో భాగమైన బిర్లాను, తన తాజా బ్రాండ్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారం ఒక శక్తివంతమైన హామీపై ఆధారపడినది: "బిర్లాను లీక్‌ప్రూఫ్ పైపులతో అనంతమైన మనశ్శాంతి". ఈ ప్రచారం వినియోగదారుల ప్రధాన సమస్య అయిన లీకేజ్ సమస్యను పరిష్కరించడంపై దృష్టి సారిస్తుంది. దీర్ఘకాలిక విశ్వసనీయతపై నెలకొన్న అనుమానాలను తొలగిస్తూ, బిర్లాను లీక్‌ప్రూఫ్ పైపులను నమ్మదగిన పరిష్కారంగా ఆవిష్కరిస్తుంది. బిర్లాను పైపులు ఆధునిక ఆవిష్కరణలు, నాణ్యత ప్రథమ ఉత్పత్తి విధానాలు, భవిష్యత్ ఆవశ్యకతలకు అనుగుణంగా రూపొందించిన ఉత్పత్తి శ్రేణితో సురక్షితమైన, దీర్ఘకాలిక ప్లంబింగ్ వ్యవస్థలకు నాయకత్వాన్ని చాటుతున్నాయి. పైపుల విభాగంలో, బిర్లా న్యూ సీపీవీసీ, యుపివిసి, ఎస్ డబ్ల్యూఆర్, సైలెంట్ పైప్స్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, ఫోమ్‌కోర్, ప్రెజర్, కాలమ్, కేసింగ్, హెచ్ డిపిఇ, ఎండిపిఇ, గ్యాస్, ఎలక్ట్రోఫ్యూజన్ ఫిట్టింగ్‌లు, వాటర్ ట్యాంకులు వంటి 20 కి పైగా వర్గాలలో విస్తృత శ్రేణి ఉత్పత్తులను అందిస్తుంది. లీక్‌ప్రూఫ్ హామీ యొక్క గుండె వద్ద మా ప్రత్యేకమైన ఆవిష్కరణ ట్రూఫిట్ సాంకేతికత ఉంది. ఇది ఫిట్టింగ్ మోల్డింగ్, పైప్ ఎక్స్‌ట్రూషన్ దశలలో డైమెన్షనల్ ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తుంది, పైపులు, ఫిట్టింగ్‌ల మధ్య పరిపూర్ణ ఫిట్‌ను నిర్ధారిస్తుంది. ఇది లీక్‌ప్రూఫ్ కీళ్లను నిర్ధారిస్తుంది. బిర్లాను చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పియూష్ బచ్లాస్ మాట్లాడుతూ, "ఈ ప్రచారం మమ్మల్ని నిజంగా విభిన్నంగా చేసే విషయాలను సంగ్రహిస్తుంది – లీక్‌ప్రూఫ్ పనితీరు యొక్క వాగ్దానం, మా కస్టమర్లు ప్రతిరోజూ బిర్లా పేరుపై ఉంచే నమ్మకం. లీకేజీ వినియోగదారులకు నిరాశపరిచే, పునరావృతమయ్యే ఆందోళనగా ఉండటంతో, ఈ ప్రచారం ప్రేమపూర్వక పద్ధతిలో పరిష్కారాన్ని అందించడానికి ఇద్దరు పిల్లల మధ్య సంభాషణను ఉపయోగిస్తుంది. బిర్లాలో, స్థిరమైన డిజైన్, కఠినమైన నాణ్యతతో ఖచ్చితమైన ఆవిష్కరణలను కలపడం ద్వారా మేము మనశ్శాంతిని సృష్టిస్తాము. క్లిష్టమైన సమస్యను పరిష్కరించడమే కాకుండా భవిష్యత్ నీటి నిర్వహణ పరిష్కారాల కోసం టోన్‌ను సెట్ చేయడం ద్వారా వినియోగదారులతో మరింత అర్థవంతమైన రీతిలో కనెక్ట్ అవ్వడానికి ఈ ప్రచారం మా నిబద్ధత." ఈ లైట్-హార్టెడ్ చిత్రం డిడిబి ముద్రా కల్పించి, మీడియా అప్‌డేట్ బాధ్యతను మ్యాడిసన్ నిర్వహిస్తోంది. బిర్లాను బ్రాండ్ యొక్క ప్రధాన వాగ్దానం "నో లీకేజ్" ఆధారంగా, ఈ ప్రచారం ఆ వాగ్దానాన్ని ఒక ఉపమానం, హాస్య కథనం ద్వారా ప్రదర్శిస్తుంది. కథలో ఇద్దరు అల్లరి పిల్లలు ఉన్నారు. వారు తమ రహస్యాలను పైపు ద్వారా పంచుకుంటారు – ఇది బిర్లాను పైపు ఎంత బలంగా ఉందో చూపిస్తుంది, ఒక్క చుక్క కూడా బయటకు రాదు – శారీరకంగా, భావోద్వేగపరంగా. ఈ ఆహ్లాదకరమైన, కానీ తీవ్రమైన కథన విధానం ఉత్పత్తి యొక్క లీక్‌ప్రూఫ్ విశ్వసనీయతను ప్రదర్శించడమే కాకుండా, ప్రేక్షకులతో భావోద్వేగ సంబంధాన్ని కూడా పెంపొందిస్తుంది. ఇది బిర్లాను బ్రాండ్‌ను విశ్వసనీయమైన, నమ్మదగిన, ప్రత్యేకమైన ఎంపికగా ఉంచుతుంది. బిర్లాను లిమిటెడ్ పైప్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అరుణ్ కుమార్ మాగూ ఇలా వ్యాఖ్యానించారు: "బిర్లానులో, మేము చేసే ప్రతి పనిలోనూ ఆవిష్కరణ ముందంజలో ఉంటుంది. ఇంజనీరింగ్ నైపుణ్యం నుండి స్థిరమైన తయారీ ప్రక్రియల వరకు, మేము ప్రతి దశలోనూ ముందుకు ఆలోచిస్తాము. బిర్లాను యొక్క యాజమాన్య ట్రూఫిట్ టెక్నాలజీ అనేది అధునాతన అచ్చు రూపకల్పన, ఖచ్చితమైన పైపు వెలికితీతను సజావుగా అనుసంధానించే తయారీ ప్రక్రియ. ఇది పైపులు, ఫిట్టింగ్‌ల మధ్య లీక్-ప్రూఫ్ జాయింట్‌లను సృష్టించడంలో సహాయపడుతుంది. ఈ ప్రచారం ద్వారా, మేము లీక్-ఫ్రీ గ్యారెంటీకి మా నిబద్ధతను ప్రదర్శిస్తున్నాము. ఇది కస్టమర్-కేంద్రీకృత, భవిష్యత్తు-సిద్ధంగా ఉన్న కంపెనీగా బిర్లాను బ్రాండ్‌ను మరింత బలపరుస్తుంది. మా యుపివిసి పైపులు, ఫిట్టింగ్‌ల కోసం ఆర్గానిక్ బేస్డ్ స్టెబిలైజర్‌లను (ఓబిఎస్) స్వీకరించిన పరిశ్రమలో మొదటి వ్యక్తిగా ఉండటం మాకు గర్వకారణం. ఇది 100% హెవీ మెటల్-రహిత ఫార్ములేషన్. ఈ సాహసోపేతమైన నిర్ణయం మాకు ప్రకృతి-సానుకూల దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది, ఇది భారతదేశంలో సురక్షితమైన పైపులను అందించడానికి మా నిబద్ధతను బలోపేతం చేస్తుంది. " ఈ ప్రచారం టెలివిజన్, ఓటిటి, డిజిటల్, ఓఓహెచ్, బిటిఎల్ యాక్టివేషన్‌లను విస్తరించి ఉన్న ఇంటిగ్రేటెడ్ మీడియా వ్యూహం ద్వారా అమలు చేయబడుతోంది, ఇది పట్టణ, గ్రామీణ మార్కెట్లలో విస్తృతమైన చేరువ, ప్రభావాన్ని నిర్ధారిస్తుంది.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవినేని ఉమా

**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు సోదరుడు బండే శేషగిరిరావు కుమారుడు కి ఈనెల 8న వివాహమైనది. సోమవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బండే శ్రీనివాసరావు సోదరుడు గృహానికి విచ్చేసి శ్రీకాంత్-దుర్గాప్రసన్న దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులుబొబ్బా గోవర్ధన్ తో పాటు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పెదమద్దాలి గ్రామంలో యూరియా కొరత....



**పామర్రు ఆగస్టు 11 మేజర్ న్యూస్ :** పామర్రు మండల పరిధిలోని పెదమద్దాలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద యూరియా లేకపోవడంతో సోమవారం రైతులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు ఏర్పడాయి. తమ సహకార సంఘానికి మరో 20 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రామకోటేశ్వరరావు, కార్యదర్శి తెలిపారు. ఈ సమస్య తలెత్తడానికి ప్రధానంగా పలు కారణాలు ఉన్నాయని ఈ సందర్భంగా పలువురు రైతులు పేర్కొన్నారు. ఒక గ్రామానికి సంబంధించిన సంఘానికి 10 టన్నులు యూరియా రాగా, రెండు గ్రామాలకు చెందిన సొసైటీకి, నాలుగు గ్రామాలు ఉన్న సొసైటీకి కూడా అదే విధంగా పది టన్నుల చొప్పున యూరియా రావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. తమ సహకార సంఘం పరిధిలో నాలుగు గ్రామాలు ఉన్నాయని దీంతో తమకు యూరియా సరిపోవడం లేదన్నారు. సమస్యను సహకార సంఘం చైర్మన్ రామకోటేశ్వరరావు స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కుమార్ రాజా సాయంత్రంలోగా సమస్యను పరిష్కరించే మార్గం చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. దీనితో రైతులు ఆందోళన విరమించి తమకు సకాలంలో యూరియా, ఎరువులు అందేలా చూడాలని కోరారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కుమార్ రాజాకు ఈ సందర్భంగా పామర్రు మండల బిజెపి అధ్యక్షుడు ముదునూరు శివకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా కూటమి



**పామర్రు ఆగస్టు 11 మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకోవడంలో తమకూటమి ప్రభుత్వం ముందుంటుందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. సోమవారం పామర్రు పార్టీ కార్యాలయంలో మొవ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన పుట్టి అనూషకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 83,459 రూపాయల చెక్కును ఆయన అందించారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందిన ఈ చెక్కును మంజూష కుటుంబ సభ్యులకు అందించి ఆమె ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వీరంకి తులసీదాసు తదితరులు పాల్గొన్నారు.

## సాంబిరెడ్డి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కైలే

**తోట్లవల్లూరు ఆగస్టు 11 మేజర్ న్యూస్ :** తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు శివారు ఆళ్ళవారపాలెంలో సోమవారం జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాంబిరెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. గృహప్రవేశం అనంతరం జరిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో కూడా ఆయన పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి దంపతులకు ఆయన శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో మండలం లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేడుకల్లో వ్యర్థల నిర్వహణ ఖచ్చితంగా జరగాలి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఏ వేడుకైనా వ్యర్థాల నిర్వహణ ఖచ్చితంగా జరగాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌యం అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా టిక్కిల్ రోడ్డు, క్రీస్తు రాజు పురం, ఎన్టీఆర్ కాలనీ, కనకదుర్గ వారధి, కృష్ణలంక ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఏ వేడుకైనా సరే సంబంధిత ప్రాంతంలో గల శానిటరీ ఇన్స్పెక్టర్‌తో మాట్లాడి చెత్త బుట్టలో వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలని ప్రజారోగ్య శాఖధిపతి డాక్టర్ కె. అర్జునరావును ఆదేశించారు. ప్రజలు కూడా తమ ఇంట్లో లేదా కళ్యాణ మండపంలో కానీ వేడుకలు నిర్వహించుకున్నప్పుడు రోడ్డుమీద వ్యర్థాలను పారివేయకుండా, వ్యర్థాల సక్రమంగా నిర్వహించాలని, పాటించని పక్షంలో జరిమానకు అర్హులని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. తదుపరి కృష్ణలంక ఏపీఎస్ఆర్ స్కూల్ లో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్ లో ఎటువంటి మరమ్మతులు ఉన్న వెంటనే పూర్తి చేయాలని, మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యత అధికారుల దేనని కమిషనర్ అన్నారు.

# నిందితులకు కఠిన శిక్షపడేలా చర్యలు







**మొవ్వ మేజర్ న్యూస్ :** వరకట్న వేధింపులకు బలైన పల్లికొండ శ్రీవిద్య ఆత్మహత్యకు కారకులైన నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుని శ్రీవిద్య ఆత్మకు శాంతి చేకూరేలా కృషి చేస్తానని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. ఇటీవల ఉయ్యూరులో అత్తింటి వేధింపులకు మరణించిన పల్లికొండ శ్రీవిద్య కుటుంబ సభ్యులను సోమవారం మండల పరిధిలోని కొండవరం గ్రామంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ శైలజ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శ్రీ విద్య వివాహం అయ్యి మూడు నెలలకి చనిపోవడం చాలా బాధాకరమన్నారు. భర్త తోపాటు అత్తింటి వారు అదనపు కట్నం కోసం శ్రీవిద్యను మానసికంగా శారీరకంగా హింసించి ఆమె మరణానికి కారకులైన వారిని క్షమించరాని నేరంగా పరిగణిస్తున్నట్లు అన్నారు. రాష్ట్రంలో మరి ఏ మహిళకు ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు అత్తరింట్లో ఆడపిల్లలకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులు దృష్టికి తీసుకురావాలని అందుకు రక్షణ కల్పించడానికి వన్ స్టాప్ సెంటర్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, మహిళా కమిషన్లు వంటివి అండగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. ఆడపిల్లలు ఫిర్యాదు చేయడంలో సంకోచించవద్దని సమస్యలు ఎదుర్కోవడంలో ఆత్మశైర్యంతో చైర్పర్సన్ శైలజ మహిళలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తమ కుమార్తె చనిపోయేంత పిరికిది కాదని పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని శ్రీవిద్య తల్లిదండ్రులు చైర్పర్సన్ శైలజను కోరారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్ డి ఓ బి ఎస్ హేల షారోన్, డిఎస్పి ధీరజ్ వినీల్, తహసిల్దార్ కే మస్తాన్ పలువురు అధికారులు పాల్గొన్నారు.



## ప్రముఖ వైద్యులు పెద్దిరాజు మరణం తీరని లోటు

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల ప్రముఖ ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ ఉద్దండి పెద్దిరాజు ( 70) సం" రాత్రి అకాల మరణం చెందినారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అందే జగదీష్ వారి భౌతిక గాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఘంటసాల గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ గా బలహీన వర్గాలకు విశేష సేవలు అందించారు. వీరి మరణం పేద వర్గాలు తీరని లోటు అని ఆవేదన చెందారు. ఆర్ఎంపి వైద్యులు పెద్దురాజుకు ఇద్దరు కుమారులు. ఆర్ఎంపీ డాక్టర్ కోదాటి నాంచారయ్య, సిపిఐ నాయకులు కోదాటి నాగయ్య, సిపిఐ నాయకులు నల్లమోలు పెద్దిరాజులు పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

## తల్లి చెంతకు తప్పిపోయిన బాలుడిని చేర్చిన శక్తి టీం బృందాలు




**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** మహిళలు, బాలికల యొక్క రక్షణ కొరకు కల్పించబడుతున్న మహిళా చట్టాలను గురించి మహిళలకు, విధ్యార్థినీ విధ్యార్థులకు శక్తి యాప్, అత్యవసర సేవలైన కీలకమైన టోల్-ఫ్రీ నెంబర్ లపై విస్తృతంగా అవగాహన కల్పించడమే లక్ష్యంగా నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, పర్యవేక్షణలో ఎన్.టి.ఆర్. పోలీసు కమిషనరేట్ పరిదిలోని శక్తి టీం బృంధాలు, మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి నగరంలోని వివిధ ప్రదేశాలలో మహిళలకు, బాలికలకు వారి రక్షణకు కల్పించబడిన మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ నేపధ్యంలో సోమవారం మధ్యాహ్నం సమయంలో శక్తి బృంధం మహిళా పి.సి.లు 3260 ఎస్ కే బి బి శైలజ, 3735 అనూష అను వారు పి.ఎన్.బి.ఎస్. ఏరియాలో మహిళాలకు మహిళా చట్టాలపై, శక్తి యాప్ లపై అవగాహన కల్పిస్తున్న సమయంలో ఒక బాలుడు తప్పిపోయి ఆ ఏరియాలో తిరగడాన్ని గమనించి సదరు బాలుడిని ఆపి వివరాలు అడుగగా తల్లి పేరు మాత్రమే చెప్పుతూ అడ్రెస్ చెప్పలేకపోతుండటంతో చుట్టుపక్కల విచారించిన ఎవ్వరూ తెలియదు అని చెప్పడంతో వెంటనే పై అధికారులకు సమాచారం అంధించి మహిళా పోలీసు స్టేషన్ కు తీసుకువచ్చినారు. మహిళా పి.ఎస్. ఇన్స్పెక్టర్ వాసవి సదరు బాలుడిని కూర్చోపెట్టి వివరాలు అడుగగా తల్లి పేరు చెప్పినాడు, ఎక్కడకి వచ్చారు అని అడుగగా హాస్పిటల్ కి వచ్చినట్లు తెలుసుకుని పాత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి విచారించి సదరు బాలుడి తల్లికి క్షేమంగా అప్పగించడం జరిగింది. అతి తక్కువ సమయంలో బాలుడిని అతని తల్లి వద్దకు క్షేమంగా చేర్చడం జరిగింది. ఈ క్రమంలో బాలుడి తల్లి మాట్లాడుతూ.....తన భర్త చనిపోయినట్లు, విజయవాడ చిట్టినగర్ ఏరియాలో తన ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నట్లు, పిల్లల్లో ఇద్దరు పిల్లలకు అనారోగ్యం కారణంగా పాత ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి చికిత్స చేయిస్తున్న క్రమంలో తనతో పాటు ఉన్న రెండవ బాబు (5 సం.) కనిపించక పోవడంతో చుట్టుపక్కల విచారించి ఏం చెయ్యాలో తెలియని సమయంలో విజయవాడ శక్తి బృంధం వారు బాబుని తీసుకువచ్చి అప్పగించినందుకు పోలీసు వారి మేలు మరువలేనని కృతజ్ఞతలు తెలిపింది. ఈ నేపధ్యంలో సదరు శక్తి బృంధం మహిళా పి.సి.లు 3260 ఎస్ కే బి బి శైలజ, 3735 అనూష లను అధికారులు అభినంధించారు.

## బాల శివ శంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక కృష్ణా నది పాయలో స్వయంభుగా వెలసిన బాల శివ శంకర్ భగవాన్‌కు విశేషంగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. విశ్వాస నామ సంవత్సరం శ్రావణమాసం బహుళపక్షం విదియ తిధి సోమవారం పురస్కరించుకొని ఆలయ నిర్వాహకురాలు గుడి సేవ విజయలక్ష్మి ఆలయ ప్రధాన పూజారి సుబ్బయ్య శాస్త్రిలు స్వామివారికి విశేష పూజలు అర్చనలు నవవిధ అభిషేకాలు నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు భక్తులు కోరిన కోరికలు తీర్చే విలవేల్పుగా వీరాజిల్లుతున్న బాల శివశంకర భగవాన్ను సుదీర్ఘ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి ఆలయ ఆవరణలో గల పుట్టలో పాలు పోసి పసుపు కుంకుమ పువ్వు పళ్ళతో పూజలు నిర్వహించి గణపతి కుమారస్వామి వారికి టెంకాయలు సమర్పించి బాల శివశంకర భగవాన్ కు లింగాష్టకం సాముహికంగా పారాయణం చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మి స్వయంగా పర్యవేక్షించారు ఆలయ ఆవరణ శివ నామస్మరణతో మారు మోగింది.

## ప్రజా సేవ ప్రయాణం నయనానందం

**స్పృహాప్తి, అమరావతి ఐ హాస్పిటల్ సేవలు భేష్**

**ఆరోగ్య ఆంధ్ర సాకారానికి సమష్టి భాగస్వామ్యం అవసరం**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**ఎన్‌టీఆర్ జిల్లా, ఆగస్టు 11, మేజర్ న్యూస్ :** సర్వేంద్రియానాం.. నయనం ప్రధానమని, పేదల కంటి ఆరోగ్యాన్ని కాపాడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న స్పృహాప్తి చారిటబుల్ ట్రస్ట్, అమరావతి ఐ హాస్పిటల్ సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం నగరంలోని పటమట నల్లూరువారి కళ్యాణమండపంలో స్పృహాప్తి చారిటబుల్ ట్రస్ట్, అమరావతి ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నయనం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సుసంపన్న, ఆరోగ్య, ఆనంద స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టి కృషి అవసరమని.. తొలి అడుగుగా 2029 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఈ మహాయజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలోని పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు స్పృహాప్తి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి శుక్లం ఆపరేషన్లు చేయడంతోపాటు మందులు అందించారు. కార్యక్రమంలో ఫింగర్ ప్రింట్ బ్యూరో డీఎస్‌పీ ఆర్.శివారెడ్డి, స్పృహాప్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వి.భారతీదేవి, అమరావతి ఐ హాస్పిటల్ ఎండీ డా. శైలజ కేతినేని, స్పృహాప్తి బృంద సభ్యులు టి.మాధురి, డి.పద్మ, వి.లేపాక్షి, కంటి వైద్య నిపుణులు డా. వేణు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు
చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం,
విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో
పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకటట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999